కార్యకర్తలపై గురుతర బాధ్యత

- వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా సమష్టి కృషి
- పార్టీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి
- మహిళా లోకం జగనన్నకు అనుకూలం
- ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీలతో ఆత్మీయ సమావేశం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



నాయకులకు ఎలక్షన్ మెటీరియల్ అందజేస్తున్న ఝాన్సీ, అమర్‌నాథ్

గాజువాక: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించే బాధ్యత కార్యకర్తలపై ఉందని పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. సమన్వయంతో పని చేసి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసేందుకు కృషి చేద్దామన్నారు. కార్యకర్తలకు అండగా ఉండి వారి ఉన్నతికి సహకరిస్తానని చెప్పారు. గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేందుకు తల్లిదండ్రులు ఎలా బాధ్యత వహిస్తారో కార్యకర్తలు అటువంటి బాధ్యత చేపట్టాలని కోరారు. విశాఖకు తలమానికమైన పీఎస్‌యూలను ప్రభుత్వరంగంలో కొనసాగించేందుకు ఎంతకైనా పోరాడతానన్నారు. గత ఐదేళ్లలో గాజువాకలో జరిగిన అభివృద్ధి మున్ముందు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ గెలుపు అనివార్యమని పేర్కొన్నారు. గతంలో తాను బొబ్బిలి, విజయనగరం ఎంపీగా ఉన్నప్పుడే విశాఖ సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడానని చెప్పారు. విశాఖ ఉజ్వల భవిష్యత్ కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

నాకు, పల్లాకు అదే తేడా: అమర్‌నాథ్

గాజువాకలో ప్రజాస్వామ్య వ్యవస్థను స్థాపిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తనను గెలిపిస్తే గాజువాకలో తానొక్కడినే ఎమ్మెల్యేగా ఉంటానని, పల్లా శ్రీనివాసరావును గెలిపిస్తే గాజువాకలో నలుగురు ఎమ్మెల్యేలు ఉంటారని అన్నారు. గతంలో ఇదే పరిస్థితిని చవిచూసిన ఓటర్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తనను గెలిపిస్తే ప్రజాహిత కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని హామీ ఇచ్చారు. తనకు అవకాశం ఇస్తే తన తండ్రి గురునాథరావు మాదిరిగా మంచిపేరు తెచ్చుకుంటానన్నారు. తన తాత అప్పన్న ఈ గడ్డ నుంచే పోటీ చేసి గెలుపొందారని, ఈ ఎన్నికల్లో తనను కూడా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గం గాజువాక అని, అన్ని కులాలు, మతాలు, ప్రాంతాలకు చెందినవారు ఇక్కడ నివసిస్తుండటంతో ఇది మినీ కాస్మోపాలిటన్ సిటీగా ఉందన్నారు. అందువల్ల బూత్ కమిటీ కన్వీనర్లు స్థానిక నాయకులను సమన్వయపరుచుకొని పని చేయాలన్నారు. పోల్ నిర్వహణను బట్టే ఫలితాలు వస్తాయని, అందువల్ల బూత్ కమిటీ సభ్యులంతా క్షేత్రస్థాయిలో కష్టపడాలని కోరారు. పార్టీ కోసం పని చేయడానికి ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చే వలంటీర్లను ఆదరించి, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. రానున్నది జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని, పార్టీ కోసం పని చేసే వలంటీర్లకు తిరిగి ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు.

మహిళలే మన స్టార్ క్యాంపెయినర్లు

రాష్ట్రంలో 70 శాతం మంది మహిళలు వైఎస్సార్ సీపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, వారు మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో మహిళలే మనకు స్టార్ క్యాంపెయినర్లుగా పని చేస్తారన్నారు. పార్టీలో ఎవరూ అసంతృప్తి చెందవద్దని, లోపాలేమైనా ఉన్నా వాటిని సరిచేసి అందరికీ ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు.

11 నుంచి మహిళా సమావేశాలు

ఈ నెల 11 నుంచి 23 వరకు నియోజకవర్గంలోని 94 సచివాలయాల పరిధిలో రోజుకు ఆరు చోట్ల మహిళా సమావేశాలను నిర్వహించనున్నట్టు అమర్‌నాథ్ తెలిపారు. ఈ ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరడానికి చాలామంది వస్తుంటారని, వారిని పార్టీలోకి ఆహ్వానించక తప్పదని అన్నారు. ఈ విషయంలో పార్టీ శ్రేణులు అన్యథా భావించవద్దన్నారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత పార్టీలోకి ఎవరిని తీసుకోవాలన్నా అందరి అనుమతి తప్పకుండా తీసుకుంటానన్నారు. ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వస్తే మళ్లీ మనమంతా తలెత్తుకొని తిరుగుతామని అన్నారు.

ఎన్నికల్లో విజయమే సంక్షేమ సారథికి కానుక: ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా జగన్ మోహన్‌రెడ్డికి కానుక అందిద్దామన్నారు. కార్యకర్తలందరూ ఏకతాటిపై ఉండి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి రామచంద్రరావు, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, నాయకులు దామా సుబ్బారావు, తిప్పల దేవన్‌రెడ్డి, ఆళ్ల శివ గణేష్, కోమటి శ్రీను, పల్లా చినతల్లి, బోగాది సన్ని, మహాలక్ష్మినాయుడు, మొల్లి చిన్న, యువశ్రీ, కోమటి రమాదేవి, మంత్రి మంజుల, తిప్పల స్వాతి, గొరుసు రామలక్ష్మి, విజయ, సంతోషి, పుష్ప, ఒమ్మి ఈశ్వరి, విమలా థామస్, ధనాల ఉమ, శిరీష, జె.లక్ష్మి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమర్ విజయానికి సహకరించండి

మంత్రి అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి



బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ నివాసంలో గుడివాడ నాగమణి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ గెలుపునకు సహకరించాలని ఆయన మాతృమూర్తి నాగమణి కోరారు. గ్రామ నాయకులు, పెద్దలను కలిసి, అమర్‌నాథ్‌ను ఆశీర్వదించి, విజయాన్ని అందించాలని కోరుతున్నారు. అందులో భాగంగా సోమవారం ఆమె 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కాలనీ పెద్దలను కలిశారు. అమర్‌నాథ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించాలన్నారు. బీసీ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ నివాసంలో ఆమెను కలిసి మద్దతు కోరారు. సానుకూలంగా స్పందించిన యువశ్రీ మాట్లాడుతూ ఇప్పటికే తాము గాజువాకలో పలు చోట్ల ప్రచారం చేస్తున్నామని చెప్పారు. భారీ మెజార్టీతో అమర్‌నాథ్ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



79వ వార్డులో సమావేశమైన నాయకులు

అగనంపూడి: వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి పార్టీ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ 79వ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు కోరారు. పాత అగనంపూడిలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యకర్తలు, నాయకుల మధ్య భేదాలు లేకుండా ఐకమత్యంతో పనిచేసి అత్యధిక మెజార్టీతో గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుర్రం శ్రీను, జెర్రిపోతుల సమర, మామిడి శ్రీను, సోమునాయుడు, రాము, గళ్ల గణపతి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించండి

గాజువాక: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈనెల 30లోగా చెల్లించే భవన యజమానులకు 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆస్తిపన్ను చెల్లింపుదారులందరూ వినియోగించుకోవాలని కోరారు. గాజువాక జోనల్ కార్యాలయంలో సౌకర్యం కేంద్రంతో పాటు ఆన్‌లైన్, వార్డు సచివాలయాల్లో పన్నును చెల్లించవచ్చన్నారు.

ఆత్మీయ సత్కారం



ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: ఉగాదిని పురస్కరించుకుని తలారివానిపాలెం గ్రామ నాయకులు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగిని, ఇద్దరు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. 85వ వార్డు తలారివానిపాలెం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీలో 36 ఏళ్ల పాటు కండక్టర్‌గా పని చేసి పదవి విరమణ పొందిన తలారి కోటేశ్వరరావును, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.గణపతి, డి.సత్యమునిలను సత్కరించారు. అనకాపల్లి జిల్లా పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నరసింహమూర్తి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, జి.వెంకటరమణ, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పాలవలసకు చెందిన ఏలగట్ల సూర్యారావు(42) ఫార్మాసిటీలో మేనేజర్‌గా పని చేస్తూ అగనంపూడి కొండయ్యవలసలో అద్దె ఇంట్లో భార్య మణితో కలిసి నివాసముంటున్నాడు. ఇటీవల తండ్రి మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లిన సూర్యారావు, భార్యను అక్కడే ఉంచి వచ్చాడు. అయితే, పెళ్లయినా సంతానం కలగకపోవడం, తండ్రి కూడా మరణించడంతో మనస్తాపానికి గురైన సూర్యారావు అగనంపూడికి వచ్చి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియపరిచారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలను పఠించి, స్వామికి హారతి ఇచ్చారు.

ఉక్కు ఉద్యమం భావితరాలకు స్ఫూర్తి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు చేస్తున్న ఈ ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1152వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు కూర్చుని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు కర్మాగారం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న ఐలా సిబ్బంది

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఆటోనగర్ ఈ బ్లాక్ దరి బసవ తారకనగర్‌లో ఏపీఐఐసీ గ్రీన్ బెల్ట్ స్థలంలో ఆక్రమణలను అడ్డుకునేందుకు అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేస్తూ రహదారులను, ఏపీఐఐసీ స్థలాలను ఆక్రమిస్తున్నారని అధిక సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఏపీఐఐసీ డీజెడ్ఎం జయరాం సిబ్బందితో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జూనియర్ మేనేజర్ వై.రాంబాబు, ఏఈ అవినాష్, ఐలా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్‌స్టడీస్‌కు ప్రాధాన్యం



ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న పైడిరాజు, మహేశ్వరరావు

విశాఖ విద్య: ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడుగా ఇమంది పైడిరాజు (అడవివరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం), అధ్యక్షుడిగా సింగంపల్లి రామారావు(జీహెచ్ఎస్ పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా వి.బాలాజీ ఎంపికయ్యారు. మహిళా ప్రతినిధిగా ఎస్. సంధ్యారాణి (ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్), గౌరవ సలహాదారుగా ఎస్.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా టి. రామారావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఆర్‌వి.నారాయణను ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.పాండవులు, ఆర్థిక కార్యదర్శిగా ఎంవీఆర్ సోమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.మహేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నేత్రపర్వంగా నృసింహుడి తిరువీధి



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సాయంత్రం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకీలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు, పారాయణదారులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

'నా ఆరోగ్యం - నా హక్కు'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట: 'నా ఆరోగ్యం – నా హక్కు' విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే అంశంపై లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శేషమ్మ మాట్లాడారు. పోక్సో చట్టం, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కలెక్షన్, డిస్పోజల్ గురించి వివరిస్తూ లీగల్ అవేర్‌నెస్ ఏ విధంగా పాటించాలనే దానిపై వైద్యులు వృత్తి నియమాలు పాటిస్తూ చట్టబద్ధంగా ప్రవర్తించాలన్నారు. తద్వారా సమస్యలు ఉత్పన్నం కావని చెప్పారు. డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చాలా వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి మాట్లాడుతూ మంచినీరు తాగడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, పలువురు వైద్యులు డాక్టర్ బద్రీ, డాక్టర్ జగదీశ్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం, హెల్త్ ఎడ్యుకేటర్, పలు ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

నూకాంబికా .. నమోస్తుతే..

- కొత్త అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



నడుపూరులో ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ



దయాల్‌నగర్‌లోని స్వర్ణ నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: కొత్త అమావాస్య సందర్భంగా ఊరువాడా సందడి నెలకొంది.. ఎక్కడ చూసినా భక్తుల కోలాహలం కనిపించింది. మండలంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన నూకాలమ్మ వారి జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

- చిన నడుపూరులో నూకాలమ్మ వారికి విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు.
- 76వ వార్డు పెదనడుపూరులో నూకాంబిక గుడిని ఆలయ కమిటీ సభ్యుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.
- 74వ వార్డు వెంపళ్లనగర్‌లో నూకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. గాజువాక నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బంతి కోళ్ల రామారావు, గంధం సాయి, సురేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయం వద్ద సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

స్వర్ణ నూకాంబికకు విశేష పూజలు

దయాల్‌నగర్ క్వారీ రోడ్డులోని స్వర్ణ నూకాంబిక ఆలయంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకున్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారి పండగ నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అమ్మవార్లను దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, నంబారు రాజు, బోనెల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అమర్‌నాథ్ సతీమణి

అగనంపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని 85వ వార్డు శనివాడలోని నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాంబిక అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అమ్మవారిని గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి సోమవారం దర్శించుకున్నారు. ఆమె వెంట సురేఖ ఉన్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదం, మజ్జిగ అందించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

- దువ్వాడ, ఫార్మాసిటీ కాలనీ, లంకెలపాలెం, సెక్టార్–1 కాలనీల్లో నూకాలమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు.



వెంపళ్లనగర్‌లో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న అమర్‌నాథ్



అక్కిరెడ్డిపాలెంలో అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



శనివాడలో నూకాలమ్మను దర్శించుకుంటున్న హిమగౌరి

తోటగరువు హైస్కూల్‌ను సందర్శించిన ఆర్జేడీ

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాల విద్యా జోన్–1 ఆర్జేడీ బి.విజయభాస్కర్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య గురించి ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ 6 నుంచి 9వ తరగతి వరకు జరుగుతున్న వార్షిక పరీక్షలు(ఎస్ఏ2) రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పరీక్షలు జరిగిన తర్వాత పేపర్లు మూల్యాంకనం చేయడం, ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయడం, ప్రమోషన్ జాబితాలు తయారు చేయడం, తదితర వాటిలో జాగ్రత్తలు పాటించాలని, అన్ని అంశాలతో వచ్చే విద్యా సంవత్సరానికి సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

భైరవస్వామికి ప్రత్యేక పూజలు



భైరవస్వామికి పూజలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

సింహాచలం: కొత్త అమావాస్య పురస్కరించుకుని భైరవవాకలోని భైరవ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి భైరవస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. భక్తులతో ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మార్గం కిటకిటలాడింది. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.